నాగులచవితి

శ్రీ కోకా బాలకృష్ణరావు

"మీరెన్నైనా చెప్పండి; నాకీ నోములమీదా, వ్రతాలమీదా, దేవుళ్ళమీదా, దయ్యాలమీదా నమ్మకంలేదండీ" అన్నాడు ఆ ఏడే బి. ఏ., డిగ్రీ పుచ్చుకోబోయే కృష్ణమూర్తి.

"అట్లాగంటే ఎట్లా నాయనా! ప్రతివారికి ఏదో సాంప్రదాయమనీ, ఆచారమనీ ఉంటుందికదా, అదీ కాక యిదీ ఒక పండగకదా! అన్ని పండగలూ చేసుకున్నట్టే యిదీనూ" అన్నాడు మామగారు.

"దానివల్ల ఉపయోగం ?"

"సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజ చేసుకుంటే ఏడాదల్లా చల్లగా చూస్తాడు నాయనా"

"పాముకి పాలుపోసి పెంచినా విషమే కక్కుతుందికాని, మనల్ని దీవించి ముద్దు పెట్టుకుంటుందిటండీ ?"

"అట్లా కాదు నాయనా, మాకు సుబ్రహ్మణ్యేశ్వరుడు మొదటినుంచి ఇలవేల్పు. ఏ పండగమానినా యిదిమాత్రం మానం. మొదటినుంచీ వున్న అలవాటుచేత అమ్మాయిమేలూ, నీమేలుకోరి యింతగా అడుగుతున్నానుగాని నీవు పంపనంటే మేంచేసేదేంలేదు."

"నామేలు మీరు మీ సుబ్రహ్మణ్యేశ్వరుడ్ని కోరకపోయినా, ఆ నమ్మకాల్లేని నన్ను ఆయనేం చేయలేడు. ఎవరైనా నమ్మినవాళ్ళనే చెరిచేది. నమ్మనినన్నేం చేయగలరు" ?

"అదేమిట్రా ఎంతదూరం చెప్పినా నీ మతమే నీది కాని, ఊ అని నీ జిహ్వతో అనలేవేం" అన్నారు యీ సంభాషణ అంతా వింటున్న కృష్ణమూర్తి తండ్రి శ్రీపతి.

"అదేదో పోనీ నువ్వే అనేయ్ ?"

"పోనీండి బావగారూ! వాడెప్పుడూ అంతే. నే చెబుతున్నా తీసుకువెళ్ళండి అమ్మాయిని"

"పోనీలెండి. అబ్బాయికి అంత యిష్టంలేనప్పుడు నన్నుమాత్రం ఎట్లా తీసుకువెళ్ళమంటారు" ?

"నాకేం యిష్టమూలేదు - అయిష్టమూలేదు. మా నాన్న పంపితే నిక్షేపంలా తీసుకువెళ్ళండి" అన్నాడు కృష్ణమూర్తి.

కొత్తకోడలు జానకి తలుపుచాటునే వుండి తన భర్తమాటలు వింటూనే వున్నది.

"ఆయన యిష్టం, అయిష్టం లేదనటం గోడమీద పిల్లివాటంగా వుంది. ఇష్టంవుంటే ఎందుకభ్యంతర పెడతారు. అయిష్టం అని చెప్పటానికి యిష్టంలేక, యిష్టాయిష్టాలు తనకేం లేవని తప్పుకుంటున్నారు." అనుకున్నది జానకి.

జానకి కొంచెంసేపు ఆలోచించింది. తనకు ఒకవైపు వెళ్ళాలని వుంది; మళ్ళీ వద్దనీవుంది. అసలు విషయం తనే తేల్చుకోలేకపోయింది. తన నిశ్చయం అయితే తన భర్తను ఒప్పించటం ఎంత తేలికో తనకి తెలుసు.

వెళ్ళటం అనే విషయం తలచుకునేటప్పటికి జానకిమనస్సు సంతోషంతో పొంగిపోయింది. అమ్మ నాన్న - చెల్లి - ఆవూరూ — ఆ కాలవ — ఆయిల్లూ, ఆదొడ్డి పూలమొక్కలు - తనకి ప్రియమైన ఆవూ — అసలు పుట్టలో ఆవుపాలు పోయాలికదూ. తనూ, తన చెల్లెలూ ప్రతియేడూ, ఆ ఆవుపాలు పితికి, తెల్లవారంగానే స్నానంచేసి ఆరేసిన మడిచీరలు కట్టుకొని, పదిగంటలకల్లా అమ్మతో కలిసి ఊరికి మైలు దూరంలోవున్న కాలవగట్టుమీద పుట్టలో పాలు పోసేటప్పుడు, అమ్మ చెప్పేది తమలో "మంచి

మొగుళ్ళు రావాలని దణ్ణంపెట్టుకోం"డని. తనకు సిగ్గు వేసేది ఆ మాటంటే.

నిజంగా తను ప్రతియేడూ నాగేంద్రుడికి పెట్టిన దణ్ణాల ఫలితమే నేటి తన వాంఛాసిద్ధని జానకి నమ్మకం.

తన చిన్నతనంలో తమ దొడ్డివెనుక పెద్ద అడవిలా వుండేది. పెద్దపెద్ద చెట్లూ, వాటిక్రింద ముళ్ళ కంచెలకు దట్టంగా పెనవేసుకొన్న తీగెలు, నేలంతా తివాచీ పరిచినట్లుండే దట్టమైన పచ్చికతో అదో విధమైన భయం కలిగించేది. అమ్మ ఎప్పుడూ తన్ను దొడ్లోకి వెళ్ళనిచ్చేదికాదు.

తనకు పదేళ్లువచ్చిన తరువాత అమ్మ తరచుగా చెపుతూవుండేది.

తన చిన్నప్పుడు, అంటే తనకు రెండేళ్ళప్పుడు, ఒకనాడు పాక్కుంటూ తోటలోకి పోయింది. అప్పటికి అమ్మ కడుపుతో వుంది. ఆమెకు కొద్దిగా వొంట్లో బాగుండకపోవడంచేత యింట్లో పడుకొని వుంది. తను పాక్కుంటూ సంపెంగచెట్టు క్రిందికి వెళ్ళింది. క్రిందరాలిన పచ్చటి సంపెంగకాయలు నోట్లో పెట్టుకొంటూ, కాళ్ళూ చేతులూ తపతపా కొట్టుకుంటున్న తన దగ్గిరికి ఏమిటో పాక్కుంటూ వచ్చింది, చుట్టలు చుట్టలుగా లొంకిలొంకిలుగా, బలే అందంగా తిరిగిందది. తనకు నవ్వువచ్చి బోసి నవ్వు నవ్వింది. అది తల ఎత్తి తనవైపుకి చూస్తూ ఆడుతోంది. తను బోసినవ్వులు నవ్వుతోంగ దానిదగ్గరగా రెండు బుల్లిచేతులతో చప్పట్లు చరుస్తూ.

ఇంతలో అమ్మ అక్కడికివచ్చి "హా!" అని కేకవేసింది. పాము జరజరా పాక్కుంటూపోయింది. తనూ పాకింది పామును పట్టుకోటానికి. ఇంతలో అమ్మవచ్చి ఎత్తుకుంది.

ఈ విషయం అమ్మ తనకి బుద్ధితెలిసిం తర్వాత అధమం రోజుకి రెండుసార్లన్నా చెపుతుండేది. అమ్మ చెపుతుంటే తను ఊహించుకునేది తను పాముతో ఎట్లా ఆడుకున్నదీ — ఎట్లా చప్పట్లు చరిచిందీ

అప్పుడే అమ్మ దణ్ణం పెట్టుకుందిట "పిల్లగాని, పిల్లాడుగాని పుడితే పేరు పెట్టుకుంటా"మని. అందుచేత తరువాత పుట్టినచెల్లికి నాగమణి అని పేరు పెట్టారు. అసలు అంతకు ముందునించే తమ యింట్లో సుబ్రహ్మణ్యేశ్వరుడి పూజ, అదీ తాతయ్యకాలంలో కూడా వుండేవిట. నాన్నకాలంలో రోజూ పూజ చేయకపోయినా భక్తిమాత్రం నసించలా. అసలు ఆ యింటపుట్టిన ప్రతిపిల్లా, ప్రతి పిల్లవాడూ చిన్నప్పుడు ఒక్కసారైనా పాముతో ఆడుకొని తీరాల్సిందే.

అవన్నీ తలచుకుంటే తనకుకూడా వెళ్ళాలనివుంది. ఎందుకనో అమ్మని చూడాలనిపిస్తోంది కొద్ది రోజుల నించి. అసలు నాన్న రాకముందే తనకి తెలుసు నాగులచవితి వస్తోందని. దానికి తప్పకుండా వెళతానే ధైర్యం తన అంతర్వాణి తనకి బోధిస్తోంది.

మొన్న దీపావళిపండక్కకూడ పంపమంటే మామగారు "క్రొత్తకోడలు కదా బావగారూ, మా యిల్లు మొదటి దీపావళి పండుగనాడు కలకల్లాడ నివ్వండి" అన్నారు. నాన్నగారు మరిమాట్లాడక వెళ్లిపోయారు

తనుపోనీ నాగులచవితికి పంపుతారేమోననుకుంది. కాని యిదంతాచూస్తే మామగారి యింట్లో నాగులచవితి అసలు ఒక పండగకానట్లే లెక్కించబడుతున్నట్లుంది. మరి తమయింట్లో నాగులచవితంటే పిన్నలకీ, పెద్దలికీకూడా అంత భక్తి ఎందుకేర్పడిందో తనకు తెలియదు. సుబ్రహ్మణ్యేశ్వరుడు తమ ఇలవేల్పు అవటంచేతనే నేమో!

ఆలోచన తెగకముందే మామగారు "అమ్మాయ్. జానకి! మీ నాన్నగారికి తాంబూలం యివ్వమ్మా" అన్నారు భోజనాలుముగించి చేతులుతుడుచుకుంటూ.

అందరికీ తాంబూలాలు యిచ్చింది. వియ్యంకులిద్దరూ కుర్చీలలో కూర్చొని పిచ్చాపాటీ చెప్పుకుంటున్నారు. కృష్ణమూర్తి త్వరగా కాలేజీకి వెళ్ళాడు.

౨

రాత్రి భోజనాలైన తర్వాత వియ్యంకులిద్దరూ బయట వరండాలో వేసిన మంచాలపై ఆసీనులై కబుర్లు

మొదలుపెట్టారు. కృష్ణమూర్తి గదిలో డ్రాయరు మీద కాళ్ళుజాపి కుర్చీకి ఆనుకొని పడుకొని "ఎకనమిక్స్" పుస్తకం తీశాడు మొదలుపెడదామని.

జానకి కంచాలు కడిగి తనపని ముగించుకొని గదిలోకి వచ్చింది. కృష్ణమూర్తి పుస్తకం చేత్తో పుచ్చుకొనే వున్నాడు కాని దృష్టిఅంతా గదితలుపుమీదా, మనసంతా జానకిమీదా వుంది. తలుపు కదలగానే తల పుస్తకంవైపుకి తిప్పి "సీరియస్" గా చదవటం మొదలుపెట్టాడు. జానకి గదిలో వస్తువులన్నీ కదిలిస్తూ, తమలపాకులు చిలకలు చుట్టటం మొదలుపెట్టింది. కృష్ణమూర్తి తల కుర్చీవెనక్కి వేళ్ళాడేసి నోరుతెరిచాడు. జానకి నవ్వుతూ ఒక్కొక్క చిలకనే నోట్లోకి తోసింది. కాని ఎంతసేపటికీ కృష్ణమూర్తి నోరు మూయటంలేదు. ఉన్న కాసిని ఆకులూ దాదాపు అయిపోయాయి

"ఎన్ని నములుతారేమిటి" అంది చిలక నోట్లో పెడుతూ "చురుక్కు"మంది వేలు "అబ్బ మరీ చిన్నపిల్లవాడైపోతున్నారు" అంది జానకి,

"చిలక కరిచిందేమో పాపం" అన్నాడు కృష్ణమూర్తి.

"మా చిలక కొరకటంకూడా క్రొత్తగా నేర్చుకుంది" అంది జానకి.

"ఊఁ..." అంటూ కృష్ణమూర్తి ఆమె చెయ్యి పుచ్చుకులాగాడు. ఆమె తప్పించుకొని అవతలికిపోయి మూతి ముడుచుకు నించుంది. కృష్ణమూర్తి పిలిచాడు. ఆమె కదలలేదు.

కృష్ణమూర్తికి అర్థంకాలేదు జానకి సత్యభామ ఎందుకయిందో. బ్రతిమాలటానికి బయలుదేరాడు కృష్ణుడిపోజులో,

"ఏం కోపమా?"

"........."

"అరె. ఇంతలోనే?"

"........."

"పంపించనన్నానని కదూ?"

"కాదు!"

"మరి?"

"చెప్పమరి?" అని ఆమె భుజాలమీద చేతులు వేసి తనవైపుకి తిప్పుకున్నాడు. ఆమె చుబుకం పట్టుకొని ముఖం పైకెత్తి కళ్లలోకి చూశాడు. ఆమె నిమీలితలోచన అయింది.

"చెప్పు ఏమిటో?"

"ఇందాక మీరట్లా ఎందుకన్నారు?"

"ఏమన్నాను"?

"దేముడ్ని దూషించారు!"

"సుబ్రహ్మణ్యేశ్వరుణ్ణేనా?"

"అవును!"

"అదీ దేవుడేనా?" అని యింకా ఏమో అనబోయాడు. కాని ఆమె తన అరచేతిని అతనినోటికి ఆనించింది. "మీ రేమైనా అనుకోండి. పైకిమాత్రం అనకండి. మీకు వాటిమీద నమ్మకం కలిగించమని నేను దేవుడ్ని ఎప్పుడూ ప్రార్థిస్తూనే వుంటా."

"పిచ్చిదానా. రాళ్లు దేవుళ్లైతే రాసులుమింగవా?" అన్నారు.

"రాళ్లను కాదుగా యిప్పుడు నేచెప్పేది! ప్రత్యక్షంగా కనుపించే నాగేంద్రుడ్ని."

"నీవు నాగేంద్రుడను, నేను పామంటా!"

"ఎట్లాగైనా పిలవండి, అర్థంమాత్రం అదే!"

"అయితే అవి దేవుళ్లని నేను నమ్మలేను!"

"నమ్మకం కలిగినప్పుడే నమ్ముదురుకాని, కాని దూషించవద్దు,"

"చిత్తం! ఇంతకీ నీవిప్పుడు వెళ్ళాలా దేవుడు చవితికి"

"మీ యిష్టం!"

3

జానకి వెళ్లింది తండ్రితో. బండీ ఊళ్ళోకి మలుపు తిరిగింది. జానకికి చెప్పలేని ఆనందం ఉబికింది మనస్సులో. ఒక్కసారి పెద్ద ఉచ్ఛ్వాసంతీసి జన్మస్థలం కమ్మనిగాలిని గుండెనిండా దట్టించింది. తను కాపరానికి వెళ్లింతర్వాత మళ్లీ యిదే మొదటిసారి స్వగ్రామం రావటం.

ఇంకా కొంచెం దూరంపోయి నాలుగిళ్లు దాటింది బండి. దూరాన కాలవగట్టు, వరసగా ఆగట్టుమీద చెట్లూ కనుపించాయి. ఒక్కొక్క చెట్టే లెక్కపెట్టింది ఏమీ తోచక. 15, 20, 25 వ చెట్టుదగ్గరికి వచ్చేటప్పటికి దృష్టి ఆగింది. దుబ్బులాటి చెట్టు కొమ్మల మీదనుంచి మానుమీదికీ, మానుమీదనుంచి క్రింద వ్యాపించివున్న పుట్టమీదికీ దృష్టి వ్యాపించింది. హృదయం ఉబికింది. మనస్సులోనే నమస్కారం చేసింది దూరానవున్న పుట్టకు, తన భర్తను చల్లగా కాపాడమని.

బండీ యిల్లు చేరింది. మణివచ్చి అక్క చెయ్యి పుచ్చుకొని అక్క వచ్చినందుకు మురిసిపోయింది.

తల్లి కూతురికి దిష్టితీసి కాళ్ళు కడిగించి లోపలికి తీసుకు వెళ్ళింది.

ఒక్కసారిగా గదీ, సావడీ, వంటయిల్లూ, దొడ్డీ, అన్నీ కలియతిరిగింది జానకి. దొడ్లో యిదివరకు సంపెంగ చెట్టువున్నచోటు కనుపించింది. తనకి పాము కనుపించిం తర్వాత నాన్నగారు దొడ్లోని పెద్దపెద్ద చెట్లన్నీ కొట్టించి శుభ్రంచేయించి మంచి మంచి పూల మొక్కలు వేశారు. ఇప్పుడు దొడ్డి బాగుంది. ఇదివరకు సంపెంగచెట్టు వుండేచోట యిప్పుడు నందివర్ధన చెట్టు వుంది.

అక్కడనుంచి దృష్టి దొడ్డి చుట్టూ తిరిగింది. మూలగా పాతిన గాతానికి కట్టినఆవు తనవైపుకు మెడనిక్కబెట్టి చూచింది. ఒక్కసారిగా ఆవు దగ్గరికి పోయి దాని మెడక్రింద చేయివేసింది - అది ముఖం పైకెత్తింది, గోకమన్నట్టుగా తోక ఆడిస్తూ.

మర్నాడు నాగులచవితి. ఆ రాత్రంతా మర్నాటికి కావలసిన వస్తువులు సమకూర్చుకోటంతో సరిపోయింది.

తెల్లవారుఝామునే లేచి కాలకృత్యాలు తీర్చుకొని అక్కచెల్లెళ్లు ఆవుదగ్గరికి వెళ్ళారు. చెల్లెలు దూడను విడిచింది. అక్క పాలు పితికింది. ఒక పొదుగు దూడకి వదలగా చెంబు నిండింది. నిండిన చెంబుతో లేచి నించుంది జానకి. మణి మళ్లీ దూడను విడిచింది. దూడ ఒక్క పరుగుతో వెళ్లి తల్లిపొదుగు గుద్దింది.

తెల్లవారింది. స్నానాలు పూర్తయాయి అందరికీ. అక్కచెల్లెళ్లు కాళ్లకి పసుపు పూసుకొని పారాణి పెట్టుకున్నారు. అమ్మకూడా స్నానంచేసి పూజకి కావలసిన వస్తువులు సర్దుతూ వంటచేయటం మొదలు పెట్టింది. అక్కచెల్లెళ్లు వెళ్లారు పూలు కోయటానికి.

మూలనున్న నందివర్ధన చెట్టు విరగబూసింది. పూలన్నీ కలిపితే పెద్దబుట్టడయ్యాయి. ఇంట్లో తెచ్చి పోశారు పళ్లెంలో.

అమ్మతో ఒకగంట కబుర్లు చెబుతూ కూర్చుంది. మణి చెవులు నిక్కబొడుచుకొని వింటోంది. 8 గంటలైంది. నాన్నగారు స్నానంచేసివచ్చి సంధ్యవార్చి 8½ కల్లా పూజ మొదలుపెట్టారు. ఏడాదికొకసారి చేసే పూజ కాబట్టి ఏవేవో చేయటంవల్ల 10 గంటల దాకా పట్టింది. పూజ అయింతర్వాత పాలు, చలిమిడి, పువ్వులు, పుట్టకళ్లు, పసుపు, కుంకుం, కర్పూరం, యింకా కావలసినవీ పూజల పళ్లెంలో పెట్టుకొని బయలుదేరారు పుట్టదగ్గరికి.

(సశేషము)